సాక్షి తిరుపతి

ఆదివారం । 3 । సెప్టెంబర్ । 2023



పుస్తక పఠనంతో విజ్ఞానం

పుస్తక పఠనంతో విజ్ఞానం పెంపొందుతుందని ఏపీ గ్రంథాలయ పరిషత్ చైర్మన్ మందపాటి శేషగిరిరావు తెలిపారు. - 8లో



కాలుష్య రహిత సమాజ స్థాపనకు కృషి

కాలుష్య రహిత సమాజ స్థాపనకు కృషి చేయాలని రెండో తిరుపతి అదనపు జూనియర్ సివిల్ జడ్జి పిలుపునిచ్చారు. - 8లో

	గరిష్టం	కనిష్టం
తిరుపతి	33	26
చిత్తూరు	32	24
తిరుమల	28	21
గూడూరు	34	26
నగరి	34	26

న్యూస్‌రీల్

నాణ్యమైన విద్యే లక్ష్యం



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న జేసీ డీకే బాలాజీ, డీఈఓ శేఖర్, సంస్థ డెప్యూటీ డైరెక్టర్ సీమకుమారి

తిరుపతి అర్బన్: విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందించేలా సేవా సంస్థలు కృషి చేయాలని జాయింట్ కలెక్టర్ డీకే బాలాజీ పిలుపునిచ్చారు. శనివారం కలెక్టరేట్‌లో స్మైల్ ఫౌండేషన్ సంస్థ వారి ఆధ్వర్యంలో స్టెమ్ ఎడ్యుకేషన్ కార్యక్రమాన్ని హెడ్ మాస్టర్స్, ఉపాధ్యాయులకు నెక్స్‌ప్లోర్స్‌పై అవగాహన కల్పించారు. ముందుగా స్టెమ్ ఎడ్యుకేషన్ కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం జేసీ మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మక ఆలోచనలను ప్రేరేపించేలా బోధన ఉండాలన్నారు. డీఈఓ శేఖర్ మాట్లాడుతూ నాణ్యమైన విద్య ద్వారా నిరుపేద విద్యార్థులకు సాధికారత కలిప్పించాలనే లక్ష్యంతో స్మైల్ ఫౌండేషన్ కొనసాగుతోందన్నారు. కార్యక్రమంలో అపోలో యూనివర్సిటీ ప్రొఫెసర్ సత్యనారాయణ, స్మైల్ ఫౌండేషన్ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శివుని సేవలో ఇస్రో మాజీ చైర్మన్



ఇస్రో మాజీ చైర్మన్‌కు జ్ఞాపిక అందజేస్తున్న ఆలయ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని శనివారం ఇస్రో మాజీ చైర్మన్ కిరణ్‌కుమార్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ దక్షిణ గోపురం వద్ద చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు ఆయనకు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

పటిష్టంగా పౌరసరఫరాల విభాగం

తిరుపతి అర్బన్: పౌరసరఫరాల విభాగం సమర్థవంతంగా పనిచేయాలని జాయింట్ కలెక్టర్ డీకే బాలాజీ ఆదేశించారు. ఓ వైపు రేషన్ దుకాణాల నుంచి పేదలకు అందుతున్న నిత్యావసర సరుకుల పంపిణీపై నిత్యం తనిఖీలు చేపట్టాలన్నారు. మరోవైపు వంట గ్యాస్ సిలిండర్ల వాడకంపై నిఘా పెట్టాలని డీఎస్‌ఓ రాజరఘువీర్‌కు ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో జిల్లా సివిల్ సప్లయ్ వారి నేతృత్వంలో విజిలెన్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ వైఎస్ చైర్మన్ హోదాలో జాయింట్ కలెక్టర్ డీకే బాలాజీ కమిటీని నిర్వహించారు.

గడువులోపు ప్రభుత్వ భవనాలు పూర్తి

తిరుపతి అర్బన్: ప్రభుత్వ భవన నిర్మాణాలు గడువు లోపు పూర్తి చేయాలని కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. శనివారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కేఎస్.జవహర్ రెడ్డి సంబంధిత కార్యదర్శులతో కలిసి రెవెన్యూ అంశాలతోపాటు ప్రభుత్వ భవనాలు, వ్యవసాయ అనుబంధ రంగాల అభివృద్ధిపై సమీక్షించారు. అనంతరం కలెక్టర్, జాయింట్ కలెక్టర్ జిల్లా అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. 2023ను అంతర్జాతీయ మిల్లెట్స్ సంవత్సరంగా ప్రకటించిన నేపథ్యంలో రాగులు, జొన్నలు, కొర్రలు తదితర పంటలను రైతులు సాగుచేసేలా అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లా సర్వే అధికారి జయరాజ్, జిల్లా గృహనిర్మాణశాఖ అధికారి వెంకటేశ్వరరావు, జిల్లా వ్యవసాయ అధికారి ప్రసాదరావు, జిల్లా పశు సంవర్థక శాఖ అధికారి రవికుమార్ పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 14 గంటలు


తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 22 కంపార్ట్‌మెంట్లు నిండాయి. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 14 గంటల్లో దర్శనం లభిస్తోంది.

మహా స్మరామీ!

తిరుపతిలో వైఎస్సార్‌కు నివాళి అర్పిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



వైఎస్సార్ కూడలి వద్ద జోహార్ వైఎస్సార్ నినాదాలతో టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి



జిల్లాలో వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలదండలేసి ఆత్మీయంగా నివాళులర్పించారు. వాడవాడలా సేవా కార్యక్రమాలు మిన్నటించారు. ఆయన జ్ఞాపకాలను స్మరించుకుంటూ కన్నీళ్లు పెట్టుకున్నారు. రాజన్న లేనిలోటు తీర్చలేనిదని ఆవేదనలో మునిగిపోయారు. చెరగని చిరునవ్వుతో పేదల గుండె గుడిలో గూడుకట్టుకున్నారని ఉప్పొంగిపోయారు. భౌతికంగా దూరమైనా ఆయన ఆప్యాయత, అనురాగాలు, అభివృద్ధి కార్యక్రమాలు చిరస్థాయిగా నిలిచిపోయాయని కొనియాడారు. జోహార్ వైఎస్సార్.. వైఎస్సార్ అమరరహే అంటూ నినాదాలు మిన్నంటించారు.

- జిల్లా వ్యాప్తంగా వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమాలు
- వాడవాడలా మిన్నంటిన అన్నదానాలు
- మహానేత జ్ఞాపకాలను నెమరు వేసుకున్న నేతలు
- రాజన్న విగ్రహానికి పూలదండలేసి ఆత్మీయంగా నివాళులు

తిరుపతి సిటీ : జిల్లా వ్యాప్తంగా దివంగత ముఖ్యమంత్రి వైఎస్. రాజశేఖరరెడ్డి వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించారు. అన్నదానాలు, సేవా కార్యక్రమాలతో అన్ని పట్టణ, నియోజకవర్గ కేంద్రాల్లో పార్టీ శ్రేణులు ఘనంగా నివాళులర్పించారు.

- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తన నివాసంలో మహానేత వైఎస్.రాజశేఖరరెడ్డికి నివాళి అర్పించారు.



తిరుపతిలో నివాళి అర్పిస్తున్న ఎంపీ గురుమూర్తి

- తిరుపతి తుడా కార్యాలయం వైఎస్సార్ విగ్రహానికి టీటీడీ చైర్మన్, స్థానిక ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు.
- తిరుపతి క్యాంప్ కార్యాలయంలో ఎంపీ గురుమూర్తి వైఎస్సార్‌కు ఘన నివాళులర్పించారు.
- తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి వెంకటగిరి పట్టణంలో ఎస్సార్‌కు నివాళి అర్పించారు.
- చంద్రగిరిలో తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.
- సత్యవేడు నియోజకవర్గంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పాల్గొన్నారు.
- శ్రీకాళహస్తి పట్టణంలో శ్రీకాళహస్తీశ్వరాలయ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు, ఎమ్మెల్యే తనయుడు బియ్యపు ఆకర్ష్ రెడి, రేణిగుంట ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, సూళ్లూరుపేటలో ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య. గూడురు ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్‌రావు మహానేత విగ్రహానికి నివాళి అర్పించారు.



ఏర్పేడులో నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం



వెంకటగిరిలో నివాళులర్పిస్తున్న రామ్‌కుమార్‌రెడ్డి



గూడూరులో పండ్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు



సత్యవేడులో అన్నదానం చేస్తున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం



నాయుడుపేటలో వైఎస్సార్‌కు నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే కిలివేటి



చంద్రగిరిలో అన్నదానం చేస్తున్న తుడా చైర్మన్ మోహిత్‌రెడ్డి

వర్సిటీ అభివృద్ధిలో..
భాగస్వాములవుదాం

- ఘనంగా ఎస్వీయూ వ్యవస్థాపక దినోత్సవం
- జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించిన వీసీ, రిజిస్ట్రార్
- ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు




కార్యక్రమాన్ని ప్రారభిస్తున్న వీసీ, రిజిస్ట్రార్



తిరుపతి సిటీ: ఎస్వీ యూనివర్సిటీ 69వ వ్యవస్థాప దినోత్సవాన్ని శనివారం వర్సిటీ నాన్ టీచింగ్ సిబ్బంది ఘనంగా నిర్వహించారు. వర్సిటీ శ్రీనివాస ఆడిటోరియంలో సాంస్కృతిక కార్యక్రమాలు పెద్ద ఎత్తున ఏర్పాటు చేశారు. గత వారం రోజులుగా ఉద్యోగ సంఘాలకు క్రీడాపోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. అంతకుముందు జ్యోతిప్రజ్వలన చేసి వర్సిటీ వ్యవస్థాపక దినోత్సవాన్ని వీసీ రాజారెడ్డి, రిజిస్ట్రార్ హుసేన్, సిబ్బంది ప్రారంభించారు. వర్సిటీ అభివృద్ధిలో బోధన, బోధనేతర సిబ్బంది పాత్ర కీలకమన్నారు. వారి సహాయసహకారాలు మరువలేనివని వీసీ కొనియాడారు. నాన్ టీచింగ్ అసోసియేషన్, ఎస్ఎమ్ఆర్ అసోసియేషన్, హాస్టల్ అసోసియేషన్ నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

13న సాంస్కృతిక పోటీలు

తిరుపతి కల్చరల్: యువజన సర్వీసులశాఖ, రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఈనెల 13న నరసింహ తీర్థం రోడ్డులోని ఎమరాల్డ్స్ డిగ్రీ కళాశాలలో యువ కళాకారులకు జిల్లా స్థాయి సాంస్కృతిక పోటీలు నిర్వహించనున్నట్లు సెట్విన్ సీఈఓ డాక్టర్ వీ.మురళీకృష్ణ తెలిపారు. శ్రీవివేకానంద స్వామి జయంతి సందర్భంగా ప్రతి ఏటా నిర్వహించే యువజనోత్సవాల్లో భాగంగా జిల్లా స్థాయి యువజన కళాకారులకు ఈ సాంస్కృతిక పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 15 నుంచి 29 ఏళ్ల వయస్సు కలిగిన యువతీ యువకులు అర్హులని తెలిపారు. అర్హత కలిగిన యువతీ యువకులు ఈనెల 13వ తేదీలోపు తమ పేరు, పుట్టిన తేదీ, పోటీలో పాల్గొనే అంశాలను సెట్విన్ కార్యాలయం, తిరుపతి చిరునామాకు అందజేయాలని కోరారు. మరిన్ని వివరాలకు 0877-2286921, 9440573537, 7036428762లలో సంప్రదించాలని సూచించారు.



తగ్గేదేలే!

భారత అంతరిక్ష పరిశోధనాసంస్థ (ఇస్రో) జోష్ మీద ఉంది. వరుసగా సూర్యచంద్రులపై పరిశోధనలకు ఎక్కుపెట్టింది. మొన్న చంద్రయాన్-3 సక్సెస్.. నేడు ఆదిత్య ఎల్-1 సక్సెస్‌తో సంబరాల్లో మునిగి తేలుతోంది. విశ్వంలో దాగి ఉన్న నిఘూఢ రహస్యాల గుట్టువిప్పుతూ మన్ననలు అందుకుంటోంది. అగ్రదేశాలకూ సాధ్యం కాని పనిని సుసాధ్యం చేస్తూ అనూహ్య విజయాలను సొంతం చేసుకుంటోంది. రికార్డులు తిరగరాస్తూ ప్రపంచ అగ్రశ్రేణి సంస్థగా రూపుదిద్దుకుంటోంది.

సూళ్లూరుపేట: ఇస్రో అద్భుత విజయాలను సొంతం చేసుకుంటోంది. ఇప్పటికే చంద్రయాన్-3 ద్వారా చంద్రుడి దక్షిణ ధ్రువంపై కాలుపెట్టి పరిశోధనలు కొనసాగిస్తోంది. తాజాగా శనివారం సూర్యుడిపై పరిశోధనలు చేసేందుకు ఇస్రో ఆదిత్య ఎల్-1 ఉపగ్రహాన్ని పీఎస్ఎల్‌వీ సీ57 రాకెట్ ద్వారా నింగిలోకి దిగ్విజయంగా పంపింది. సౌరగోళంలో సౌరగాలులు, జ్వాలలు, రేణువుల తీరుతెన్నుల గురించి పరిశోధనలు చేయడానికి శ్రీకారం చుట్టింది. సౌర తుఫాన్ సమయంలో వెలువడే రేణువుల వల్ల భూమిపై సమాచార వ్యవస్థకు అవరోధాలు ఏర్పడుతున్నాయని అంచనా వేసి కాంతిమండలం (ఫోటోస్పియర్), వర్ణ మండలం (క్రోమోస్పియర్)పై అధ్యయనం చేయనుంది. ఆపై ఆ సమాచారాన్ని సేకరించే భూమికి చేరవేయనుంది. సౌర వాతావరణాన్ని పరిశోధించేందుకు కరోనాగ్రఫీ ప్రయోగమని కూడా అంటారు. భూమికి 1.5 మిలియన్ కిలోమీటర్ల దూరంలో ఉన్న సూర్య వ్యవస్థ లాంగ్రేజ్ పాయింట్-1 (ఎల్-1)లో హాలో కక్ష్యలోకి ఆదిత్య ఎల్-1 ఉపగ్రహాన్ని ప్రవేశపెట్టి పరిశోధనలు చేస్తారు. విద్యుదయస్కాంత, కణ, మాగ్నెటిక్ ఫీల్డ్ డిటెక్టర్లను ఉపయోగించి ఫోటోస్పియర్, క్రోమో స్పియర్ సూర్యుని బయట పొరలను పరిశీలించేందుకు ఉపగ్రహంలో ఏడు పేలోడ్స్‌ను అమర్చి పంపారు. భారత్ సూర్యుడిపై పరిశోధనల చేయడానికి ఇది మొట్ట మొదటి ప్రయోగం. ఈ విజయం చారిత్రాత్మకమని ఇస్రో పేర్కొంది. ఈ ప్రయోగానికి సుమారుగా రూ.378 కోట్లుదాకా వ్యయం చేశారు.





మూడో దశలో మోసుకెళ్తూ.. నాల్గో దశలో వదిలిపెడుతూ..

గ్రహాంతర ప్రయోగాలు చేయడంలో ఇస్రో దిట్ట

గ్రహాంతర ప్రయోగాలు చేయడంలో ఇస్రో దిట్ట అని ఇప్పటికే నిరూపితమైంది. 2008లో చంద్రయాన్-1, 2019లో చంద్రయాన్-2, 2013లో మంగళయాన్-1 పేరుతో అంగారకుడిపై పరిశోధనలు, జులై 14న చంద్రయాన్-3, తాజాగా శనివారం పీఎస్ఎల్‌వీ సీ57 ద్వారా ఆదిత్య-ఎల్1 ఉపగ్రహాన్ని కూడా విజయవంతంగా ప్రయోగించింది.

నాలుగుదశల ప్రయోగం ఇలా జరిగింది

– పీఎస్ఎల్‌వీ సీ57 రాకెట్‌ను నాలుగు దశల్లో ప్రయోగించారు. మొదటి, మూడో దశలు ఘన ఇంధనంతో, రెండు నాలుగు దశలు ద్రవ ఇంధనంతో నిర్వహించారు.

అభినందనలు



వరదయ్యపాళెం: పీఎస్ఎల్వీ-సీ57 రాకెట్ ప్రయోగం విజయవంతం అయినందుకు శ్రీసిటీఎండీ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఇస్రో అధ్యక్షులు కే.సోమనాథ్‌కు, షార్ డైరెక్టర్ ఏ.రాజరాజన్‌కు, షార్ శాస్త్రవేత్తలకు అభినందనలు తెలిపారు.

దేశానికే తలమానికం

సూళ్లూరుపేట: పీఎస్ఎల్‌వీ సీ57 రాకెట్ ప్రయోగం విజయవంతమైనందుకు ఇస్రో శాస్త్రవేత్తలను తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి, ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అభినందించారు. వాణిజ్యపరంగా ఇస్రో సాధిస్తున్న విజయాలు దేశానికే తలమానికమన్నారు.

అందరి సహకారంతో వర్సిటీ అభివృద్ధి


కొలువుదీరిన నూతన పాలకమండలి సభ్యులనుద్దేశించి ప్రసంగిస్తున్న వీసీ రాజారెడ్డి

తిరుపతి సిటీ: ఎస్వీ యూనివర్సిటీ అభివృద్ధిలో అందరం సమైక్యతతో భాగస్వాములవుదామని వీసీ కే.రాజారెడ్డి పిలుపునిచ్చారు. శనివారం పరిపాలనా భవనంలోని సెనేట్ హాల్‌లో నూతన పాలకమండలి కొలువుదీరింది. ఈ సందర్భంగా ఏడుగురు పాలక మండలి సభ్యులుగా నియమితులైన వారికి వీసీ నియామక పత్రాలను అందజేశారు. అనంతరం సభ్యులను పలువురు ఉద్యోగ సంఘ నాయకులు, అధికారులు, బోధన, బోధనేతర సిబ్బంది అభినందనలు తెలిపారు. పాలక మండలి సభ్యులుగా నియామక పత్రాలు అందుకున్న వారిలో ఆచార్య సుమకిరణ్, ఆచార్య పద్మనాభం, డాక్టర్ మొహిద్దీన్ బాషా, డాక్టర్ మంజుల, డాక్టర్ సురేంద్రనాథ్‌రెడ్డి, ఆచార్య సుగుణరెడ్డి, ఆచార్య సుగుణరెడ్డి, జ్యోతి ఉన్నారు.

ప్రమాణ స్వీకారం


విశ్వనాథరెడ్డిని సత్కరిస్తున్న జేఈఓ


పాలకమండలి సభ్యులు సీతారెడ్డిని, సత్యనారాయణను సత్కరిస్తున్న జేఈఓ వీరబ్రహ్మం

తిరుమల: టీటీడీ ధర్మకర్తల మండలి సభ్యులుగా సీతారెడ్డి, విశ్వనాథరెడ్డి, సత్యనారాయణ శనివారం తిరుమల శ్రీవారి ఆలయంలో ప్రమాణ స్వీకారం చేశారు. స్వామివారి సన్నిధిలో వీరిచేత జేఈఓ వీరబ్రహ్మం ప్రమాణ స్వీకారం చేయించారు. స్వామివారి దర్శనానంతరం రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనం చేశారు. అనంతరం వీరికి జేఈఓ స్వామివారి లడ్డూ, ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో డెప్యూటీ ఈఓలు లోకనాథం, గోవిందరాజన్ పాల్గొన్నారు.

విద్యాసామగ్రి పంపిణీ


విద్యాసామగ్రి పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ మేరిగ

గూడూరు రూరల్: స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ సంస్థ చైర్ పర్సన్ పొనకా దేవసేనమ్మ జన్మదిన వేడుకల్లో భాగంగా స్థానిక సీఎస్ఎం ఉన్నత పాఠశాలలో శనివారం హసీమ్ సహకారంతో ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ చేతుల మీదుగా విద్యార్థులకు విద్యా సామగ్రిని పంపిణీ చేశారు. నేతలు కోదండరామయ్య, గోపాల్ యాదవ్, సురేష్‌రెడ్డి, ముని, సాయి, ఇమ్రాన్, రాహుల్, అశోక్, సురేంద్ర, సూర్య, వసీమ్, సందాని పాల్గొన్నారు.

మిద్దెపై నుంచి పడి కార్మికుడి మృతి


మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ

నాయుడుపేట టౌన్: నాయుడుపేట మండలం, మేనకూరు సెజ్ పరిధిలోని లాయల్ టెక్స్‌టైల్స్ పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికుడు చిరన్‌జిత్ మోండల్(31) అక్కడే హస్టల్ మిద్దెపై నుంచి పడి మృతి చెందిన సంఘటనపై శనివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం.. పశ్చిమబెంగాల్ ప్రాంతానికి చెందిన చిరన్‌జిత్ మోండల్ నెల కిందట లాయల్ టెక్స్‌టైల్స్ పరిశ్రమలో కార్మికుడిగా చేరాడు. ఇతర కార్మికులతో కలిసి అక్కడే పరిశ్రమలో ఉండే హస్టల్‌లో ఉంటున్నాడు. శుక్రవారం అర్ధరాత్రి 12.30 ప్రాంతంలో చిరన్‌జిత్ మోండల్ హస్టల్ మిద్దె గోడపై కూర్చుని ఉండగా.. ప్రమాదవశాత్తు జారి కిందపడి మృతి చెందాడు. ఈ మేరకు పరిశ్రమ హెచ్ఆర్ మనోజ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. యాజమాన్య ప్రతినిధుల చొరవతో చిరన్‌జిత్ మోండల్ మృతదేహాన్ని అంబులెన్స్‌లో పశ్చిమ బెంగాల్‌లోని తన స్వగ్రామానికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

పుస్తక పఠనంతో విజ్ఞానం

తిరుపతి అర్బన్: పుస్తక పఠనంతో విజ్ఞానం పెంపొంది ఉన్నత స్థాయికి చేరుకుంటారని ఏపీ గ్రంథాలయ పరిషత్ చైర్మన్ మందపాటి శేషగిరిరావు తెలిపారు. ఆయన శనివారం తిరుపతి అన్నమయ్య సర్కిల్ సమీపంలో మనం- మన గ్రంథాలయం కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రంథాలయం ఆవరణలో మొక్కలు నాటారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం విద్యార్థుల కోసం పోటీ పరీక్షల పుస్తకాలను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నైనార్ మధుబాల, గ్రంథాలయ కార్యదర్శి పి.శర్మ, సభ్యులు జే.శివప్రసాద్, ఎం.ధనుంజయులు పాల్గొన్నారు.

కాలుష్య రహిత సమాజ స్థాపనకు కృషి

తిరుపతి లీగల్: కాలుష్య రహిత సమాజ స్థాపనకు ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతతో కృషి చేయాలని తిరుపతి రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి పల్లపోలు కోటేశ్వరరావు తెలిపారు. తిరుపతి మండల న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం చిగురువాడలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. అనంతరం గ్రామంలో మొక్కలు నాటారు.

విద్యుత్ షాక్‌తో యువకుడి మృతి

నాగలాపురం: విద్యుత్ షాక్‌తో యువకుడు మృతి చెందిన సంఘటన శనివారం నాగలాపురం మండలంలోని ఉత్తరపు కోటవీధిలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం.. ఉత్తరపు కోటవీధికి చెందిన షణ్ముగం(26) నాగలాపురం బజారు వీధిలో ప్రొవిజన్ షాపులో పని చేస్తున్నాడు. పనిముగించుకుని ఇంటికి వెళ్లాడు. రాత్రి టిఫిన్ కోసం బియ్యాన్ని గ్రైండర్‌లో వేసి విద్యుత్ బటన్ నొక్కాడు. వెంటనే షాక్ తగిలి అక్కడికక్కడే మృతిచెందాడు.

కారు ఢీకొని వృద్ధుడి మృతి

చంద్రగిరి: రోడ్డు పక్కన నడిచి వెళ్తున్న గుర్తుతెలియని వృద్ధుడుని కారు ఢీకొనడంతో అతను అక్కడికక్కడే మృతి చెందిన ఘటన శనివారం రాత్రి పూతలపట్టు-నాయుడుపేట జాతీయ రహదారి మామండూరు సమీపంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం.. ఐతేపల్లి-మామండూరు మార్గంలోని సర్వీసు రోడ్డులో పాలవ్యాను తిరుపతికి వస్తుండగా, తిరుపతి నుంచి చిత్తూరు వైపు ఓ నానో కారు వెళ్తోంది. క్యాండర్ స్కూల్ వద్ద ముందు వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని కారు తప్పించే క్రమంలో పాలవ్యానుపైకి దూసుకెళ్లింది. తర్వాత పక్కనే నడుచుకుంటూ వెళ్తున్న గుర్తుతెలియని వృద్ధుడి(62) ఢీకొట్టింది. దీంతో వృద్ధుడు అక్కడికక్కడే మృతిచెందాడు.